# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 93 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

04-02-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# తిరుపతి లడ్డు ప్రసాదంపై తప్పుడు ప్రచారం

- వైఎస్ఆర్సీపీ నేతలపై దాడులు ఖండనీయం
- చంద్రబాబు, లోకేష్, కూటమి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వైఎస్ఆర్సీపీ డిమాండ్





**నవతరం శ్రీకాకుళం**

తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు కూటమి నేతలు తప్పుడు ప్రచారాలు చేయడం అత్యంత నీచమైన విష ప్రచారమని వైఎస్ఆర్సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ప్రశ్నించిన వైఎస్ఆర్సీపీ నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడుదల రజిని తదితరులపై దాడులు చేయిస్తూ, వారి ఇళ్లను ధ్వంసం చేయిస్తున్న చంద్రబాబు నాయుడు, లోకేష్, కూటమి నేతలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ మేరకు వైఎస్ఆర్సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం (03-02-2026) ఉదయం 10.00 గంటలకు ధర్మాన క్యాంప్ కార్యాలయం నుంచి పెద్దపాడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ గారికి ఫిర్యాదు అందజేశారు. అనంతరం పెద్దపాడు రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ధర్మాన రామ్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా కూటమి నేతలు కావాలనే తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికార మత్తుతో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెక్కలిలో వైసిపి భారీ బైక్ ర్యాలీ

- నియోజకవర్గ ఇన్చార్జ్ తిలక్
- రెడ్ బుక్ రాజ్యాంగం వద్దు అంబేద్కర్ రాజ్యాంగం ముద్దు .....
- ఇటీవల మాజీ మంత్రులు ఇళ్లపై దాడులు చేసిన వారిని వెంటనే శిక్షించాలి
- టెక్కలి పోలీస్ స్టేషన్ ఎదుట తిలక్ వైసీపీ నేతలు బయటాయింపు






# అన్నదాత సుఖీభవ

## కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం




**నవతరం శ్రీకాకుళం**

కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక పట్టణ నిరాశ్రయుల భవనంలో జరిగింది. ఇందులో భాగముగా కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ కుటుంబసభ్యులు కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్ రావు, అన్నప్రసాద వితరణ చేపట్టి మాట్లాడుతూ విశాఖ బి కోలనీకి చెందిన ఇప్పిలి.రమేష్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన అర్ధాంగి ఇప్పిలి.ఇందుమతి కుటుంబసభ్యులతో కలసి నగరంలో ముఖ్య కూడలిలో తలదాచుకుంటున్న నిరుపేదలకు అన్నవితరణ కార్యక్రమాన్ని జరపటం ఆనందదాయకమని, జయంతి, వర్ధంతితోపాటు ఇతరాత్ర వేడుకలకు వేదికకు, వైభవాలకు వృధాగా ఖర్చుచేసి ఆహారాన్ని పారవేసి బదులు, ఇలాంటి పేదల మధ్య జరుపుకుంటే వారి కళ్ళల్లో ఆనందాన్ని చూడవచ్చున్నారు. అన్నం పరబ్రమ్మ స్వరూపమని, అన్నదానంతో పదిమంది పేదల కడుపు నింపినవారమౌతామని, ఈ రోజు ఇప్పిలి. ఇందుమతి మంచి ఆలోచనకు మంత్రముగ్ధుల మయ్యామని, గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడ అనేక సేవలందిస్తున్న ఉర్లం.శివతేజ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలని, ప్రతి నిత్యం ఏదో ఒక సేవలో నిమగ్నమవటం మాటలకందని విషయమన్నారు. నైట్ షెల్టర్ లో నివాసకులకు, నగరంలో పేదలకు ఏదో ఒక సహాయమందించాలనుకునే వారు ఉర్లం.శివతేజ చరవాణిని (8790944902) సంప్రదించాలన్నారు.

ఈ మహోత్తర సేవా కార్యక్రమంలో కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ కుటుంబ సభ్యులు, జెసిఐ మెయిన్ శ్రీకాకుళం సలహాదారులు మణిశర్మ దంపతులు, నేటి అన్నప్రసాద దాతలు ఇప్పిలి.ఇందుమతి కుటుంబసభ్యులు, పిన్ని రత్నకుమారి, సోదరి కొరడ.అమరావతి, చిన్నారులు సంజిత్, సాధ్విక్, సేవకులు ఉర్లం.శివతేజ , రెడ్ క్రాస్ ప్రతినిధి నంది .ఉమా శంకర్, పొడుగు చరణ్, నైట్ షెల్టర్ నిర్వాహకులు, నివాసకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అవసరం



- రెడ్ బుక్ రాజ్యాంగంతో నయా బీహార్‌గా ఏపీ
- బాబు అబద్దాలను పక్కదారి పట్టించేందుకే భౌతిక దాడులు
- వైఎస్ఆర్సిపి అగ్రనేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గం
- కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలం
- వైఎస్ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గురునాథ్ యాదవ్

2లో

# శ్రీముఖలింగేశ్వరుని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు మహాశివరాత్రి వేడుకలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశం




**నవతరం శ్రీకాకుళం**


శ్రీముఖలింగ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయని, చివరి రోజు చక్ర తీర్థ స్నానాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు.

-మిగతా 2లో

# తాబేళ్ల మృత్యువులకు మత్స్య వలలే కారణం

**నవతరం శ్రీకాకుళం**

ఎచ్చెర్ల మండలం, పాతదిబ్బలపాలెం సముద్రతీర ప్రాంతంలో తాబేళ్లు ఎక్కువగా మృత్యువాత పడటానికి ప్రధాన కారణం మత్స్యకారులు వాడుతున్న వలలేనని గమనించబడింది. ముఖ్యంగా స్కిడ్ నెట్, నానా జాతి వలలు, గిల్లెట్ నెట్, టేకు వలల వలన తాబేళ్లు చిక్కుకుని మృతి చెందుతున్నట్లు పొన్నాడ వెటర్నరీ అసిస్టెంట్ సాయి ప్రసాద్ పరిశీలించి నిర్ధారించారు. అనంతరం శ్రీకాకుళం అటవీ పరిధి అధికారి, సిబ్బంది నిర్వహించిన విచారణలో, విశాఖపట్నం నుండి వచ్చే మెకానైజ్డ్ బోట్స్ వలన కూడా తాబేళ్ల మృత్యువులు అధికంగా జరుగుతున్నట్లు గుర్తించబడింది. ఈ నేపథ్యంలో, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత శాఖలు అయిన అటవీ శాఖ, ఫిషరీస్ శాఖ, మెరైన్ విభాగం, ట్రీ ఫౌండేషన్, స్థానిక మత్స్యకారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరముందని చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ చర్చలో ఆర్. రాజశేఖర్, అటవీ శాఖ అధికారి, శ్రీకాకుళం, ఆర్. వినోద్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు, శ్రీకాకుళం అటవీ పరిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఎడిటోరియల్

# చెంపపెట్టు!

కేంద్రం తీసుకొచ్చిన యూజీసీ కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించడమే కాక, ఇవి వివక్ష ఆధారితంగా, సమాజాన్ని చీల్చేలా, ప్రమాదకరంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఇది కేంద్ర అసంబద్ధ విధానానికి చెంపపెట్టు. సుప్రీం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల ప్రకటించిన 'ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక నియమావళి-2026' రూల్స్‌పై దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి. రిజర్వుడు కేటగిరీల కిందకు రాని విద్యార్థులు, బోధనా సిబ్బందికి రక్షణ కల్పించే విషయమై న్యాయస్థానంలో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ డాక్టర్ సూర్యకాంత్ మిశ్రా, జస్టిస్ బాగ్చిలతో కూడిన బెంచ్ నిబంధనల్లోని అసమానత్వాన్ని ఎత్తిచూపింది.
సమానత్వం కోసమంటూ యూజీసీ తెచ్చిన నిబంధనలు విభజనకు దారితీసేలా ఉండటమే ఆందోళనలకు ప్రధాన కారణం. మొదట్లో ఈక్విటీ కమిటీల ఏర్పాటును వామపక్ష విద్యార్థి సంఘాలు కూడా సమర్థించాయి. అయితే, కొత్త రూల్స్‌లో కుల వివక్ష నిర్వచనాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేసింది. దీంతో జనరల్, ఇతర కేటగిరీలకు చెందినవారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగారు. ఈ సెగ ఢిల్లీలోని యూజీసీ ప్రధాన కార్యాలయానికి కూడా తాకింది. లోపాలను తక్షణమే సరిదిద్దాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేస్తూ, సమానత్వాన్ని దెబ్బతీసే అంశాలను లేవనెత్తింది.
అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం కుల ఆధారిత వివక్షను తగ్గించడమే ఈ నిబంధనల లక్ష్యమని చెబుతున్నది. మరి అనుమానాల్ని, భయాల్ని నివృత్తి చేసే చర్యలకు ఎందుకు పూనుకోవడం లేదన్నదే ప్రశ్న.
ఈ నిబంధనలను రాజ్యాంగంలోని 14వ అధికరణ నుండి రూపొందించింది. '2012' మాదిరిగానే సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా వీటిని తీసుకొచ్చింది. కానీ, మరికొన్ని అంశాలను జోడించింది. నిషేధిత ప్రవర్తనను కులం, తెగ ఆధారిత వివక్షగా నిర్వచించడం. క్యాంపసుల్లో సమాన అవకాశాల కేంద్రాలు (ఈవోసీ), సమానత్వ కమిటీల వంటి నివారణ పరిష్కార యంత్రాంగం ఏర్పాటు చేయడం. అమలులో వైఫల్యాన్ని నిబంధనల ఉల్లంఘనగా గుర్తించి సంస్థలపై చర్యలు తీసుకోవడం, జరిమానాలు విధించడం ఉన్నాయి. అయితే, ఇవి యూనివర్సిటీలకు, వాటి అనుబంధ కళాశాలల్లో తప్ప ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి కేంద్ర సంస్థల్లో అమలు కావు. ఇక్కడ కూడా అమలు చేయాలనేది వస్తున్న డిమాండ్. ఇంకా చెప్పాలంటే కొత్తవాటిలో వివక్ష నిర్మూలన పేరుతో కేంద్రం నియంత్రణ కనిపిస్తున్నది. వీసీలు, అధ్యాపకుల నియామకాలలో గవర్నర్-యూజీసీ నామినీల ఆధిపత్యం పెరిగేలా కమిటీ నిర్మాణాన్ని మార్చింది. నెట్/పిహెచ్డీ వంటి వంటి అర్హతలను కఠినతరం చేసి అర్హతల పేరుతో బహిష్కరణకు దారితీసే విధానాన్ని ప్రవేశపెట్టింది.
రాష్ట్రాల పాత్రను తగ్గించి యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కేంద్రీకృత విధానంలోకి నెట్టేలా చేసింది. వివక్షను సైతం సమగ్రమైన రీతిలో నిర్వచించడంలో కేంద్రం అసమర్థత కనిపిస్తోంది. విద్యాసంస్థల్లోని వాస్తవికతలను గమనంలోకి తీసుకోలేదు. విద్యార్థులు, బోధనాసిబ్బంది ఎదుర్కొంటున్న అన్ని రూపాల్లో వివక్షను తెలుసుకుని, నిర్వచించి, గుర్తించి, నిర్మూలించడం ముఖ్యం. సమానత్వ కమిటీకి ఎవరిని ఎంపిక చేస్తున్నారన్నది కూడా ప్రధానమే. ఇది విద్యాసంస్థల అధిపతి ఇష్టాఇష్టాలకు వదిలేయరాదు. విశ్వసనీయత, జవాబుదారితనం ఉండేలా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన విద్యార్థి, ఫ్యాకల్టీ, బోధనయేతర సిబ్బంది ప్రతినిధులతో ఆ కమిటీని ఏర్పాటు చేయాలి. ఎందుకంటే, ఎంపిక కమిటీల్లో వీసీ నామినీల ప్రాధాన్యం పెరగడం వల్ల రాజకీయ జోక్యానికి అవకాశం ఉంటుంది. విమర్శనాత్మక ఆలోచనలు గల అధ్యాపకులు పక్కనపడే పరిస్థితి వస్తుంది. అలాగే, కమిటీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వచ్చే అప్పీళ్లను విచారించేందుకు అంబుడ్స్‌మన్‌ను నియమించాల్సిన అధికారాన్ని కూడా రాష్ట్రాలకే ఇవ్వాలి. అసెంబ్లీలు చేసిన చట్టాల కింద అనేక యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. అందుకు రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలకు కట్టుబడాలి. వివక్షను రూపుమాపుతామని చెప్పే కొత్త నిబంధనలు విద్యను మరింత కేంద్రీకృతం చేసి అసమానత్వానికి దారితీసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. పారదర్శకత పేరుతో ప్రజాస్వామ్య నియంత్రణను తగ్గించి నామినీల ఆధిపత్యాన్ని పెంచడం యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాలరాస్తుంది. సమిష్టి ప్రయత్నాల ద్వారా మాత్రమే కులవివక్షను సమర్థవంతంగా ఎదుర్కోగలం. ఇందులో రాష్ట్రాల పాత్ర, సామాజిక న్యాయం, అకాడమిక్ స్వేచ్ఛ ముఖ్యం. దీనికి విద్యార్థులతో పాటు అన్నివర్గాల ఐక్యత అవసరం. లేదంటే ఈ నిబంధనలు వివక్షను తుడిచేయడం కాదు, అసమానతను సంస్థాగతంగా స్థిరపరుస్తాయి. ఏమైనా సుప్రీంకోరు స్టే ఆహ్వానించదగినది. తదుపరి విచారణ మార్చి పందొమ్మిదిన జరగనుంది. ఆలోపు నిబంధనల్ని సవరించి కేంద్రం తన తప్పు సరిదిద్దుకోవాలి.

# రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అవసరం

**నవతరం -టెక్కలి**

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయని, ప్రతిపక్షాలకు చెందిన నేతలు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే, వారికి బెదిరించడం, అక్రమంగా పోలీస్ కేసులు బనాయించడం, రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా భౌతిక దాడులకు పాల్పడిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసినట్లు కనిపిస్తుందని వైఎస్ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గురునాథ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన టెక్కలిలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇటీవల వైయస్సార్సీపి రాష్ట్ర నేతలు, మాజీమంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్ళ మీద దాడి చేసి, భౌతికంగా, నానా రకాలుగా ఇబ్బందులు పెట్టడమే కాక, తిరిగి బాధితులైన వాళ్లపై కూడా పోలీసులు కేసులు పెట్టడం చూస్తే, ఒకప్పుడు నయా బీహార్ గా ఉన్నట్లు, ఇప్పుడు మన రాష్ట్రాన్ని అదే తరహాలో కూటమి ప్రభుత్వం మార్చి వేసిందని గురునాథ్ యాదవ్ ఆరోపించారు. హిందువుల ఆరాధ్య దైవమైన వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కల్తీ చేశారని బాధ్యత కలిగిన సీఎంగా ఉన్న చంద్రబాబు లేనిపోని ప్రచారం చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక అడుగు ముందుకు వేసి పంది కొవ్వు, ఆవు కొవ్వు కలిపారని సనాతన హిందూ ధర్మం అని లేనిపోని రాద్ధాంతం చేసిన విషయం తెలిసిందేనన్నారు. కూటమి సర్కార్ పెద్దలు చేస్తున్న దుష్ప్రచారంపై టీటీడీ మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి స్పందించి ఈ అబద్ధపు ప్రచారాన్ని సిట్ తో కాకుండా సి.బి.ఐ తో విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టుకు ఆశ్రయించగా, ఈ అంశాన్ని సిబిఐ కి అప్పగించిన విషయం ఆయన గుర్తు చేశారు. గత నాలుగైదు రోజుల ముందు లడ్డూ లో జంతు కొవ్వు లేదని సిబిఐ నివేదిక సుప్రీంకోర్టుకు సమర్పించినప్పటికీ, కూటమి నేతలు తాము చేసిన ఆరోపణ కు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో, ఉన్మాదంతో కూటమినేతలు ఊగిపోయి, ప్రతి పట్టణం లో లడ్డూ ప్రసాదం లో కల్తీ జరిగిందంటూ .. ఫ్లెక్సీలు వేయడం తప్పు కాదా? అని ప్రశ్నించారు. విశాఖపట్నం ఎంపీ, గీతం విద్యాసంస్థల అధినేత భరత్ కు సుమారు రూ. 5000 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను అప్పనంగా అప్పగించే ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని వైయస్సార్సీపి బయటకు తీయడంతో వెంటనే డైవర్షన్ పాలిటిక్స్ కు కూటమి సర్కార్ పెద్దలు తెర తీశారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం రచయిత నారా లోకేష్ కు తోడల్లుడైన భరత్ కు ప్రభుత్వ భూములను అప్పగించే ప్రయత్నాలు పై వైయస్సార్సీపి ఉద్యమాలకు సిద్ధమైన నేపథ్యంలో ఈ డైవర్షన్ పాలిటిక్స్ కు తెరలేపి, దాడులు, మారణకాండను సృష్టించి రాష్ట్రాన్ని మరో తాలిబన్ గా తయారు చేస్తున్నారని ఆయన విమర్శించారు. దేశమంతా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు చేస్తుంటే.. రాష్ట్రంలో లోకేష్ రాసిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను లేకుండా చేయాలని దౌర్జన్యాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కనీసం నిధులను కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసినప్పటికీ, చంద్రబాబు ప్రభుత్వం మౌనం దాల్చిన కాకుండా, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తారని భయంతో, మళ్లీ కల్తీ లడ్డూల లో రసాయనాలు కలిగి ఉన్నాయంటూ, మరో అబద్ధానికి తెర తీయడమే కాకుండా, వైఎస్ఆర్సిపి నేతలను భయపెడుతూ, అరెస్టు పర్వాలకు తెరలేపిందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను విస్మరించడం వల్ల, ఈ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో, ప్రశ్నించే వారిపై అణచివేసే చర్యలకు చేపట్టడం వల్ల, రాష్ట్రంలో పూర్తిగా లా అండ్ ఆర్డర్ క్షీణించాయని, కాబట్టి రాష్ట్రంలో ఆర్టికల్ 356 ద్వారా రాష్ట్రపతి పాలన విధించడం ఎంతో అవసరమని గుర్నాథ్ యాదవ్ స్పష్టం చేశారు.

# శ్రీముఖలింగేశ్వరుని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

గతంలో జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దర్శనానికి సంబంధించి క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటులో ఎక్కడా జాప్యం జరగకూడదని సూచించారు. వంశధార నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా తగినంత నీటి నిల్వ ఉంచాలి. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ల సౌకర్యం ఉండాలి. విద్యుత్ వైరింగ్‌ను ముందే తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో పారిశుధ్యం ప్రధాన సమస్యగా మారకుండా తగినంత మంది కార్మికులను నియమించాలని జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. క్షేత్ర పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నామని, నదిలో గజ ఈతగాళ్లను నియమిస్తున్నామని చెప్పారు. భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మణామూర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో ఏడుకొండలు, డీపీఓ భారతి సౌజన్య, ఇన్చార్జి ఆర్డీవో జయదేవీ, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, ఫైర్ ఆఫీసర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లు ఎప్పుడూ ఉన్నాయి...! వాటికి దూరంగా ఎలా ఉండాలనేదే...?

ఓ ముప్పై ఏళ్ల క్రితం(1994ప్రాంతంలో) గంపలగూడెంలోని తోటమూల టీ తాగితేనే పెద్ద నేరంగా చూసేవాళ్ళు. ఓ ఆడ పిల్ల సైకిల్ తొక్కితే వింతగా చూసేవాళ్ళు. వాస్తవానికి అవి నేరాలు కావు. వింతలు అసలే కాదు. కానీ కొంతమంది దొంగ చాటుగా సిగరెట్, బీడీలు తాగేవారు. వాటిని తాగడం స్టైల్ అని సినిమాల్లో చూపించేవారు. అనేకమంది చేసిన పరిశోధనల వల్ల వాటిని తాగితే కాన్సర్ వస్తుందని, ఊపిరి తిత్తులు దెబ్బతింటాయని తెలిసింది. ప్రభుత్వం వీటిని నిషేధించలేదు కానీ, తాగడం అనారోగ్యానికి హానికరం అని ప్రకటనలు ఇస్తుంది. ఒకప్పుడు ఎక్కడ చూసినా సిగరెట్ పీకలే కన్పించేవి.
పొగ తాగేవారితో ఇంకో ప్రమాదం కూడా వుంది. వారితో పాటు పీల్చే వారికి కూడా ప్రమాదమే. ఇక మద్యం గురించి చెప్పనవసరం లేదు. సారాపై ప్రభుత్వాలు కొన్ని సార్లు నిషేధం పెట్టాయి. గ్రామాల్లో కొందరు నాటు సారా కాసేవారు. దీనివల్ల కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. దీని గురించి వచ్చే నష్టాలని పాలక వర్గాలు పెద్దగా ప్రచారం చేయవు.


యం.రాం ప్రదీప్

ఇప్పుడు శీతల పానీయాల వల్ల నష్టాల గురించి ప్రజలకు తెలిసింది. కానీ వీటి అమ్మకాలు బానే జరుగుతున్నాయి. ప్రస్తుతం డ్రగ్స్ గురించి చర్చ జరుగుతుంది. డ్రగ్స్ వల్ల నష్టాలు కూడా చాలా ఉన్నాయి. ప్రభుత్వాలు వీటి మీద సీరియస్ గానే ప్రచారం చేస్తున్నాయి. జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు మద్యం వల్ల నచ్చే నష్టాల గురించి ఉద్యమ స్థాయిలో ప్రచారం చేశాయి. కేవలం వీటి మీద నిషేధం విధించడం వల్ల మాత్రమే పెద్దగా ఉపయోగం లేదు. పాలక వర్గాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకూడదు. వీటి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. చెడు, మంచి అలవాట్లు ఎప్పుడూ ఉంటాయి. చెడు అలవాట్లకు దూరంగా ఎలా ఉండాలనేదే పెద్ద సమస్య. కొసమెరుపు ఏమిటంటే నేను ఈ మధ్య ఓ స్నేహితుడిని ఒత్తిడికి గురైనప్పుడు నీవేమి చేస్తావు అని అడిగితే, కొంచం మద్యం తీసుకుంటా అని చెప్పాడు. ఇంకొక మిత్రుడు టూర్స్ కు వెళ్తా అని చెప్పాడు. ఇదే ప్రశ్నను వారు నన్ను అడిగితే పుస్తకం చదువుతా అని చెప్పా.

# టెక్కలిలో వైసిపి భారీ బైక్ ర్యాలీ

**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో వివిధ మండలాల నాయకులు కార్యకర్తలతో కలిసి రెడ్ బుక్కు రాజ్యాంగం వద్దు అంబేద్కర్ రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ పూలమాలని సమర్పించారు. కూటమి ప్రభుత్వము చేస్తున్న అరాచకాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అంబేద్కర్ గారికి వినతి పత్రం అందజేశారు. తదుపరి అంబేద్కర్ జంక్షన్ నుండి భారీ బైక్ ర్యాలీతో టెక్కలి పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు.
వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడుదల రజిని, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులకు పాల్పడిన తెలుగుదేశం, కూటమి నాయకుల పై చర్యలు తీసుకొని శిక్షించాలని వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జి పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని తప్పుడు ప్రసారాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కూటమి నేతలు చేస్తున్న నీచమైన విషప్రచారంపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్యని వీరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డుపై తప్పుడు ప్రచారాలకు ప్రోత్సహిస్తూ, పాల్పడుతున్న చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలనివారు కోరారు. టెక్కలి పోలీస్ స్టేషన్ వద్ద బైటాయించి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పైన.. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపైన ..తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఇన్చార్జి తిలక్ తో పాటు జడ్పిటిసి సభ్యులు దువ్వాడ వాణి, దుబ్బ వెంకటరావు, పాలవసంత్ రెడ్డి, ఎంపీపీలు అట్ల సరోజినమ్మ, నడుపూరు శ్రీరామమూర్తి, రోనంకి ఉమా మల్లయ్య, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు ఎర్ర చక్రవర్తి, గురునాథ్ యాదవ్, కోత సతీష్, నూక సత్యరాజ్, స్థానిక నేతలు తమన్న గారి కిరణ్, సత్తారు సత్యం, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతరావు హేమసుందర్ రాజు, తమిరి ఫల్గుణరావు, బుడ్డ మోహన్ రెడ్డి, వాకాడు శ్రీధర్, పివి అప్పలనాయుడు, జిల్లా, నియోజకవర్గ, మండల అనుబంధ విభాగాల నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చెయ్యి

## వైయస్సార్సీపి పలాస నియోజకవర్గం యువజన నేత సేనాపతి కిషోర్

**నవతరం -పలాస**



పార్లమెంట్లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి మొండి చేయి చూపించిందని, డబల్ ఇంజన్ అని చెప్పుకొనే కూటమి ప్రభుత్వానికి కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గం యువజన నాయకుడు సేనాపతి కిషోర్ అన్నారు. మంగళవారం ఆయన పలాసలో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కనీసం నిధులను కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు, ప్రజల జీవితాలతో చెలగాట మాడేలా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని అభివర్ణించారు. రైతులు వాడే అమ్మోనియా ఫాస్పేట్, నైట్రోజన్ ఫాస్పేట్ వంటి ధరలు భారీగా బడ్జెట్లో పెంచారన్నారు. వ్యవసాయ బడ్జెట్లో ఎరువుల సబ్సిడీ లో రూ. 16 వేలకోట్లు కోత విధించడం ఆందోళన కలిగిస్తున్న విషయం అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని కిషోర్ ప్రశ్నించారు. పంటలకు మద్దతు ధర ప్రస్తావనే లేదన్నారు. ఫసల్ బీమాకు డబ్బులు డబ్బులు పెరగాల్సింది పోయి రూ. 14,473 నుంచి రూ. 12,200 కు తగ్గించేసారన్నారు. కోకో, జీడిపప్పు వంటి హై వాల్యూ ఉత్పత్తుల పరిశోధనలకు మాత్రమే నిధులు ఇచ్చారన్నారు.
ఎగుమతులకు రూ. 350 కోట్లు, నమో డ్రోన్లకు రూ. 676 కోట్లు ఇచ్చి, సాధారణ రైతుల్ని మాత్రం బడ్జెట్లో విస్మరించారన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ. 58 వేల కోట్లు కోత విధించి పేదలకు తీరని విఘాతం కలిగించారన్నారు. చంద్రబాబు గొప్పగా చెప్పుకుంటున్న అమరావతి బుల్లెట్ ట్రైన్ కు సైతము బడ్జెట్లో మొండి చెయ్యి చూపారు అన్నారు. ఏపీ విభజన చట్టంలో హామీలు అమలు చేయాలంటూ సుదీర్ఘకాలం నుంచి రాష్ట్ర ప్రజలు కేంద్రాన్ని కోరిన గాని, విభజన హామీలు కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టింది అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తగిన స్పష్టత ఇవ్వలేదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు కేవలం 100 కోట్ల రూపాయలు తోనే బడ్జెట్లో సరిపెట్టడం జరిగిందన్నారు.

# అబ్బబ్బో... ఇన్ని రకాల పెళ్లిళ్ల....!?



హైందవ సంస్కారాల్లో వివాహం ప్రధానమైనది. వివాహం ఇద్దరు వ్యక్తుల మధ్యే కాక రెండు వంశాల మధ్య సంబంధాలు కలిపే ప్రక్రియ. అయితే వివాహాల్లో ఎనిమిది రకాలున్నాయని సనాతన ధర్మజ్ఞులు చెబుతున్నారు. అవి బ్రాహ్మ్య, దైవ, ఆర్ష, ప్రాజాపత్య, గాంధర్వ, ఆసుర, రాక్షస, పైశాచిక విధానాలు. వీటిలో ఒక్కొక్కటీ ఒక్కొక్క రకంగా ఉంటుంది. అయితే రాక్షసం అనే పేరు ఉన్నంత మాత్రాన అది బలవంతంగా చేసుకునే విధానమని భావించరాదు. సాక్షాత్తు విష్ణువు అవతారమైన కృష్ణుడే కారణ జన్మురాలు, లక్ష్మీదేవి అపర అవతారమైన లక్ష్మీదేవని ఆ విధానంలో వివాహం చేసుకున్నాడు. గాంధర్వ వివాహం గంధర్వులకే పరిమితమైనదీ కాదు. పురాణాల్లో చాలా మంది మానవ మాత్రులు కూడా ఈ విధానంలో వివాహాలు చేసుకున్నారు.

పైశాచికం మాత్రం ఆ పేరుకు తగ్గట్టుగా నింద్యమే. ఇవి ఆ వివాహాలకు పెట్టిన పేర్లు మాత్రమే వాటి వివరాలు తెలుసుకుందాం.

### బ్రాహ్మ్యము

ఈ వివాహం మంచి కుటుంబాలు ఒకే కులానికి చెందిన యుక్త వయస్కుల మధ్య జరిగేది. ఇందులో వరుడు బ్రహ్మచర్య ఆశ్రమం( విద్యార్థి దశ) పూర్తి చేసి ఉండాలి. ఇందులో కట్నం ప్రసక్తే ఉండదు. వధువు రెండు జతల వస్త్రాలు, కొన్ని ఆభరణాలతో వరుని ఇంటికి వస్తుంది. ఇందులో వధువు కుటుంబం వారు కన్యాదానం ఇమ్మని వధువు కుటంబాన్ని కోరుతారు.

### దైవం

ఇది దారిద్ర్యం లేదా ఇతర కారణాల వల్ల తగిన వరుణ్ణి పొందలేక పోయిన కన్యకు ఎవరైనా సంపన్నులు చేయించే వివాహమని స్థూలంగా చెప్పవచ్చు.

### ఆర్షం

ఇక్కడ వరుడు తాను వివాహం చేసుకోబోయే కన్య తల్లిదండ్రులకు ఏదో ఒక కానుక (సాధారణంగా పూర్వ కాలంలో ఒక ఆవు, జత ఎడ్లు) ఎదురోచ్చి వివాహం చేసుకోవడం. వధువు కుటుంబం వారు పెళ్లి ఖర్చులు భరించలేని సందర్భాల్లో ఇటువంటి కానుక ఇవ్వడం జరుగుతుంది. దీనిలో ఆర్థిక అంశాలు ఇమిడి ఉన్నందున దీనిని అభిలషణీయవిధానంగా పేర్కొన్నారు.

### ప్రాజాపత్యం

ఇది దాదాపు బ్రాహ్మ్య వివాహాన్ని పోలి ఉంటుంది. ఇక్కడ కూడా వధువు తల్లిదండ్రులు వరుని కోసం వెతుకుతారు. అయితే కన్యాదాన ప్రక్రియ ఉండదు. పాణి గ్రహణ సమయంలో కన్య రక్షణ బాధ్య తను ఆమె తండ్రి వరునికి అప్పగిస్తాడు. ఈ వివాహంలో పాణిగ్రహణానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది

### గాంధర్వ వివాహం

ఇది ప్రేమ వివాహం. దీనిలో వరుడు, వధువుల కుటుంబాల సమ్మతి ఉండదు. వారివురు ఇష్టపడి వివాహం చేసుకుంటారు. తల్లిదండ్రులు అందుబాటులో లేని సందర్భంలోను, వారి వివాహానికి వ్యతిరేకత చూపిన సందర్భంలోగాని ఈ వివాహం చేసుకుంటుంటారు. పురాణాలలో చాలా సందర్భాల్లో ఈ వివాహాలు ఉంటాయి.

### ఆసుర వివాహం

ఈ వివాహం దాదాపుగా వధువు ను పొందేందుకు వరుని కుటుంబం అనుమతి పొందేదుక కాను కలిచ్చే విధానాన్ని పోలి ఉంటుంది. అయితే వరుడు తక్కువ స్థాయి వాడవటం ఉంటుంది

### రాక్షస వివాహం


ఈ విధానంలో కన్య వివాహం చేసుకోదలచిన వారిని ఇష్టపడుతుంది. అయితే ఇది ఆమె తల్లిదండ్రులు 'వ్యతిరేంగా ఉన్న సందర్భంలో జరిగే ది. అటువంటి సమయంలో వరుడు బలవంతంగా ఆ కన్యను తీసుకుని వెళ్ళి వివాహం చేసుకోవడాన్ని రాక్షస వివాహం అంటారు. కృష్ణుడు రుక్మిణిని ఈ విధానంలోనే వివాహమాడాడు.

### పైశాచిక వివాహం

ప్మృతిలోలేని, విచక్షణ లేని స్థితిలో కన్యను ఆమె ఇష్టం లేకుండా వివాహం చేసుకోవడాన్ని పైశాచిక వివాహమంటారు. పైన చెప్పిన వివాహాలన్నిటిలో కొన్నిటిని సమ్మతమైనవిగా మరికొన్నిటిని సమ్మతం కానివిగా పేర్కొన్నారు.

రాక్షసం అనే పేరు ఉన్నంత మాత్రాన అది బలవంతంగా చేసుకునే విధానమని భావించరాదు. సాక్షాత్తు విష్ణువు అవతారమైన కృష్ణుడే కారణజన్ము రాలు లక్ష్మీదేవి అపర అవతారమైన రుక్మిణీ దేవిని ఆ విధానంలో వివాహం చేసుకున్నాడు. గాంధర్వ వివాహం గంధర్వులకే పరిమితమైనదీ కాదు. పురాణాల్లో చాలా మంది మానవ మాత్రులు కూడా ఈ విధానంలో వివాహాలు చేసుకున్నారు.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్,
ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్
కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



# శిక్ష...తర్వాతే శ్రీరామరక్ష..!

ఓ మనిషీ...స్మరించుకో..!
తొలుత రాళ్ళ వర్షం...
ఆపై పూలతో అభిషేకం..!

ఆ విధి విలాసమే
విలక్షణమైనది
నిన్ను గద్దించవచ్చు...
వేయిరీతుల పరీక్షించవచ్చు
నిప్పుల ఉయ్యాలలో
నిన్ను నిద్ర పొమ్మనవచ్చు..!

కఠిన శిక్షల కారాగారంలో
నిన్ను బంధించవచ్చు
ఎదురుదెబ్బల ఉప్పెనలో
నిన్ను ముంచెత్తవచ్చు..!

అపరిమిత వేదనల
సుడిగుండంలో...
అంతులేని శ్రమల
చక్రబంధంలో...
నిన్ను విసిరేయవచ్చు...
కష్టనష్టాల పిడుగులను
నీ మస్తకంపై మోపవచ్చు..!

సమస్యల సర్పాలు
విహరించే
కత్తులబోనులో నిన్ను
పడవేయవచ్చు
ఆకస్మిక ప్రమాదాల
అగ్నిపర్వతంపై...
దీర్ఘవ్యాధుల కంటక
మార్గంపై...
నిన్ను నడిపించవచ్చు..!

నీవు స్పృశించిన
స్వర్ణం మట్టి కావచ్చు
నీవు అడుగుపెట్టిన
ప్రతిచోటా
అగాధాలు
ఎదురుకావచ్చు..!

కానీ ఓ మనిషీ గుర్తుంచుకో...
ఆ పరంధాముడు
నిన్ను దీవించే ముందు...
కోటి వరాల అమృతాన్ని
ప్రసాదించే ముందు...
నీ ఊహలకందని
ఉన్నత శిఖరాలపై
నిన్ను అధిష్ఠించే ముందు..!

అందని ద్రాక్షల
మధురిమను
నీకందించే ముందు...
అఖండ విజయాల
స్వర్ణ సింహాసనాన్ని
నీకు సొంతంచేసే ముందు...
నీ సహనాన్ని శోధించే
'పూర్వసంధ్య' కు
ఈ కష్టాలన్నీ...ప్రత్యక్ష సాక్ష్యాలే..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్



# సాయిపల్లవి టు శ్రీలీల వయా పూజా హెగ్డే

ధనుష్ సినిమా మేటర్ ఇది. అతడు తన 55వ చిత్రాన్ని 'అమరన్' దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామితో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ముందుగా సాయిపల్లవిని హీరోయిన్ గా అనుకున్నారు. ఆ తర్వాత పూజా హెగ్డే పేరు వినిపించింది. ఫైనల్ గా శ్రీలీల దగ్గర ఆగారు. ఈసారి ఇది రూమర్ కాదు. శ్రీలీల పేరును అధికారికంగా ప్రకటించారు. ధనుష్ తో శ్రీలీలకు ఇదే తొలి పిక్చర్.

నిజానికి ఈ ప్రాజెక్టులో ధనుష్-సాయిపల్లవి అనుకున్నారు. రౌడీ బేబీ కాంబినేషన్ రిపీట్ అంటూ కోలీవుడ్ మారుమోగిపోయింది కూడా. కాకపోతే బాలీవుడ్ ప్రాజెక్టుతో బిజీగా ఉండడం, ఓ బడా తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి రెడీ అవ్వడంతో, సాయిపల్లవి ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది.

ఆ తర్వాత పూజా హెగ్డేను అనుకున్నారు. ఆమె పేరును దాదాపు ఖరారు చేశారు. స్వయంగా ధనుష్, పూజాహెగ్డేకు మాటిచ్చినట్టు ప్రచారం జరిగింది. అంతలోనే ఆమెను తప్పించి, శ్రీలీలను తీసుకున్నారు. పరాశక్తి సినిమాతో కోలీవుడ్ లో అడుగుపెట్టింది శ్రీలీల. ఆ సినిమా ఫెయిలైనప్పటికీ, శ్రీలీలకు వెంటనే మరో అవకాశం రావడం విశేషం. పాపం.. ఎటొచ్చీ పూజా హెగ్డే పరిస్థితే అగమ్యగోచరంగా మారింది. ప్రతిసారి ఏదో ఒక సినిమాకు ఆమె పేరు వినిపించడం, ఆ తర్వాత పక్కన పెట్టడం ఆనవాయితీగా మారిపోయింది.

# 94 ఏళ్ల వయసులో 61వ సినిమా





లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రిటైర్ అయ్యారని అంతా అనుకున్నారు. కానీ తను రిటైర్ అవ్వనని ఆమధ్య ఆయన ప్రకటించుకున్నారు. చెప్పినట్టుగానే సింగీతం కొత్త సినిమా షూటింగ్ నడుస్తోంది.

కెరీర్ లో 61వ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు సింగీతం. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ విషయాన్ని సదరు బ్యానర్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియో కూడా విడుదల చేసింది.

సుదీర్ఘ విరామం తర్వాత మెగాఫోన్ పట్టారు సింగీతం శ్రీనివాసరావు. ఆయన్ను అంతలా కదిలించిన ఆ కథ ఏంటనే ఆసక్తి ఇప్పుడు ప్రేక్షకుల్లో మొదలైంది. త్వరలోనే ఈ సినిమాకు టైటిల్ ఎనౌన్స్ చేయబోతున్నారు.

అన్నట్టు ఈ ప్రాజెక్టుకు దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.

వీళ్లిద్దరూ స్టోరీ డిస్కషన్ చేస్తున్న విజువల్స్ ను కూడా మేకింగ్ లో చూపించారు.

సింగీతం చివరిసారిగా వెల్ కం ఒబామా అనే సినిమాను తెరకెక్కించారు. మళ్లీ ఇన్నేళ్లకు ఈ తాజా చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఈమధ్య వచ్చిన కల్కి సినిమాకు ఆయన కొన్ని సూచనలు చేశారు. కల్కి-2 కోసం కూడా సింగీతం సేవల్ని వాడుకుంటోంది యూనిట్.

## బూరగాం ఉన్నత పాఠశాలకు దాతలు ప్రింటర్ వితరణ



**నవతరం టెక్కలి**

నేడుటెక్కలి మండలంలోని బూరగాం ఉన్నత పాఠశాల కు దాతలు ఖరీదైన ప్రింటర్ ను వితరణగా అందజేశారు. బూరగాం గ్రామంలోని కొంతమంది యువకులు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వి. రోజారమణి, కర్రి శ్రీరామ్మూర్తి సంయుక్తంగా సుమారు 18000/- విలువైన ప్రింటర్ ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.హరిప్రసన్న కు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ పరికిరాన్ని విద్యార్థుల పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ మరియు పాఠశాల అవసరాలకు వినయోగిస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన ప్రింటర్ ను వితరణగా అందించడం పట్ల దాతలకు ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## సీనియర్ జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన వైకాపా యువ నేత

**నవతరం-శ్రీకాకుళం**

సీనియర్ జర్నలిస్ట్ నిజం పత్రిక రిపోర్టర్ పి ఎస్ఎన్ఆర్ శర్మ కుటుంబాన్ని పరామర్శించిన వైకాపా యువ నేత ధర్మాన రామ్మోహర్ నాయుడు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ఎన్ఆర్ .శర్మ ఇటీవల అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకుని బైరి సింగుపురం గ్రామం శర్మ స్వగృహానికి హాజరై యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని యువనేత సూచించారు.అండగా ఉంటానని,అధైర్య పడొద్దని, సూచించారు. కుటుంబ సభ్యులను శర్మ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని. తక్షణ వైద్య.సేవలకు తన.వంతు. సహాయ సౌకర్యాల కోసం కృషి చేస్తానని యువ నేత భరోసా ఇచ్చారు.



## నారాయణ తిరుమలలో మహాలక్ష్మీ అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



**నవతరం-శ్రీకాకుళం**

ఈ నెల 27 తేదిన స్థానిక ఆర్ట్స్ కళాశాల మైధానంలో నారాయణ తిరుమలలో అమ్మవారు అవతరించి 21 వసంతాలు పూర్తి అయిన సందర్భంలో శ్రీవారితో కూడియున్న మహాలక్ష్మీ అమ్మవారికి 10,008 స్వర్ణ పుష్పాలతో 10 వేలమంది దంపతులతో స్వర్ణ పుష్పార్చన చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గరుగుబెల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు.
ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్వర్ణ పుష్పాభిషేకమహోత్సవం, శ్రీ మద్విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం గూర్చి వివరించారు. నారాయణ తిరుమల లో వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలు వార్షిక ఉత్సవాలు జరుపుకొనుచున్న సమయాన శ్రీవారి పుష్కరిణి ప్రతిష్ట, బాంగారు వాకిలి సమర్పణకు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. అయితే ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో జరిగే కార్యక్రమంనకు ఈ నెల 27 తేది మద్యాహ్నం 3 గంటలకు ప్రారంబం అవుతుందని, దంపతులు ముందుగానే చేరుకోవాలని కోరారు.
పాల్గొనదలిచిన దంపతులు 10 దంపతులు ఒక బృందంగా ఏర్పడి వారి పేర్లను ఈనెల 8 తేది లోగా నమోదు చేసుకోవాలని సూచించారు.
సమావేశంలో నారాయణ సేవాదళం సభ్యులు ఊన్న నాగరాజు, అంధవరపు ప్రసాద్, కృష్ణ, ధర్మారావు, సూర్యప్రకాశ్, రవి, భాస్కరరావు, శ్రావణ్, చందు, కృష్ణమోహన్,మిశ్రో, గుంట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 9వ తేదీన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి...

- అసెంబ్లీ సమావేశాలలో యువతకు ఇచ్చిన హామీలపై చర్చించాలి...
- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి తక్షణమే ప్రకటించాలి...
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐవైఎఫ్ డిమాండ్...

**నవతరం-శ్రీకాకుళం**

నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 9వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్ అన్నారు. ఈరోజు శ్రీకాకుళం క్రాంతి భవన్ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్న ఇంతవరకు యువతకు ఇచ్చిన హామీలును నెరవేర్చలేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలలోనైనా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై చర్చించి యువతకు న్యాయం చేయాలని అన్నారు. అదేవిధంగా యువగలం పాదయాత్రలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి పలు అంశాలపై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి చలో సచివాలయంకు పిలుపునిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఏపీ బేవరేజెస్ కార్మికులు, రేషన్ డిపో వాహనాలలో పనిచేసిన కార్మికులు, వాలంటీర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి 49 సంవత్సరాలకు పెంచాలని , టెట్ మరల నిర్వహించి అభ్యర్థులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, డీఎస్సీ అభ్యర్థులు రామమూర్తి, లక్ష్మణరావు , టెట్ అభ్యర్థులు పావని, ఉపేంద్ర, ఏపీ బేవరేజెస్ కార్మికులు రామోజీ, వాలంటీర్లు శ్రీజ, గీతా, ఏఐవైఎఫ్ నాయకులు వేణు, అన్నాజీ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఆకాశవాణిలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా దిలీప్‌కు పదోన్నతి సత్కారం

**నవతరం-విశాఖపట్నం**

స్థానిక ఆకాశవాణి కేంద్రంలో డ్యూటీ అధికారికంగా పనిచేస్తున్న తేతలి దిలీప్ కుమార్ రెడ్డికి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గా పదోన్నతి లభించింది.ఇదే కేంద్రంలో పదోన్నతి అవకాశం కల్పించారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ ఉత్తర్వులను జారీ చేశారు.డ్యూటీ అధికారిగా ఆయన 10 సంవత్సరాల పాటు పనిచేశారు. ఆకాశవాణి కేంద్రంలో సిబ్బంది కొరత వెంటాడుతున్న సరే వివిధ బాధ్యతలను అదనంగా నిర్వహించడం విశేషం.దిలీప్ పదోన్నతిని పురస్కరించుకొని మంగళవారం ఆయనకు ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్, కార్యక్రమ విభాగాధిపతి పి.వి.రామగోపాల్, సీనియర్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ లు కాశీభట్ల ఇందిర, సుధాకర్ రెడ్డి,సంఘమిత్ర తదితరులు ఘనంగా సత్కరించారు. డ్యూటీ అధికారిగా ఆయన చేసిన సేవలు మరపురానివని పి.వి.రామగోపాల్ ప్రత్యేకంగా ప్రశంసించారు.



## బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బూరె నరేంద్ర చక్రవర్తి

### బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బూరె నరేంద్ర చక్రవర్తిని పార్టీ అధిష్టానం నియమించింది

**నవతరం-శ్రీకాకుళం**

ఈ సందర్భంగా బూరె నరేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ ఒక సాధారణ కార్యకర్త స్థాయిలో ఉన్న తనను గుర్తించి బీజేపీ యువ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా రెండు పర్యాయములు , అనంతరం దీజేవీ లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు ప్రధానమంత్రి నరేంద్ర మోధీ నాయకత్వంతో రాష్ట్ర నాయకుల సారధ్యంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి, రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి, పార్టీ సిద్ధాంతాన్ని ప్రజలలోకి తీసుకువెళుతూ రాష్ట్ర స్థాయిలో పార్టీ బలోపేతంనకు కృషి చేస్తానని తెలియజేశారు...

## పింఛనుదారులకు ఉచితంగా ఇంటి వద్దకే లైఫ్ సర్టిఫికెట్స్

- వృద్ధులు, నడవలేని వారికి ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్ ఇవ్వబడును
- జిల్లాలో ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారులు సద్వినియోగపరచుకోండి
- లైఫ్ సర్టిఫికెట్ ఆఖరు తేదీ ఫిబ్రవరి 28

**నవతరం-శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశములు మేరకు 2026-27 కి సంబంధించి ఏ.పీ . స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ లో ఉన్నవారు ప్రతి ఒక్కరు ఫిబ్రవరి 28వ తేదీ వరకు జీవన ప్రమాణ పత్రములు (లైఫ్ సర్టిఫికెట్స్) సమర్పించవలసి ఉంది. ఈ ఆదేశములు శ్రీకాకుళం జిల్లా ఉపసంచాలకులు, ఖజానా శాఖ సి.హెచ్ .రవికుమార్ వారి ఆధ్వర్యంలో లైఫ్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ నుండి కొంత మంది ఔత్సాహిలైన వారిని ఓ బృందంగా ఏర్పాటు చేయడం జరిగింది. పింఛను దారులు నడవలేని వారు, వృద్ధాప్యంలో ఉన్నవారు, మంచం పట్టి ఉన్న వారికి మాత్రమే ఇంటి వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వబడును. ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు కళ్లేపల్లి సోమసుందరరావు, పై.ఎస్.ప్రసాదరావు తెలిపారు.
మీ ఇంటి వద్దకే సేవలు అందించడానికి మీరు ముందుగా ఈ దిగువ తెలిపిన నెంబర్లకు ఫోన్లు చేసి డేటు , టైము నోట్ చేసుకోగలరు. మీరు ఫోన్ చేయాల్సిన నెంబర్లు: 95022 49878, 94409 54954, 80743 38587, 94414 67792. తప్పనిసరిగా పై నెంబర్లకు ఫోన్ చేయగలరని విజ్ఞప్తి.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**